


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 16 జూలై-ఆగస్టు, 2019 సంచిక : 2, 3



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**


**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| వార్షిక చందా ... | రూ॥ 100/- |
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ 200/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ॥1000/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,
రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2
అసూయ ........ 6
నారద గర్వభంగం ........ 11
జనన మరణ చక్రము ........ 13
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 17
మాతృసంస్థ కబుర్లు ........ 21
మాతృమూర్తులకు మనవి ........ 30
నవ్వించటమే కర్మయోగం ........ 33
ఏ కులజుడైననేమి? ఎవ్వరైన .... 34
మానసిక పూజ ........ 36
సాష్టాంగ నమస్కారం ........ 39


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ప్రియ సాయివాణి పాఠక మహాశయులందరికీ శతసహస్రాలుగా శ్రీ సాయి ఆశీస్సులు లభించుగాక!

'సాధన' అనే మాటకు మూడక్షరాలే. కానీ అవి చాలా బరువైనవీ, బలమైనవీను. సత్వరజస్తమో గుణాలతో అవృతమైన మానవ జీవితాన్ని వాటికి అతీతంగా తీసుకువెళ్ళేది సాధన. నీవు-నేను-అతడు అనే భేదాలను నశింపజేయగల్గేది సాధన.

దారేషణ, ధనేషణ, పుత్రేషణ అన్న ఈషణ త్రయాన్ని నశింపజేయ గలిగేది సాధన. తనువు, ధనం, మనస్సు అన్న మూడింటినీ పరమాత్మకు అర్పించుకోగల స్థాయినిచ్చేది సాధన.

అలాంటి సాధన చెయ్యాలంటే సాధకునికి అహంకారం తగ్గించుకొని, గురు చరణాల చెంత సిద్ధంగా ఉండాలన్న తీవ్రకాంక్ష, ఉండగల ఆత్మ స్థైర్యం అవసరం. గురువు పెట్టే తీవ్ర పరీక్షలకు తట్టుకోగల సహనం, అవన్నీ తన మంచికేనన్న శ్రద్ధ - రెండూ చాలా అవసరం.

సాయి సచ్చరిత్రలో మనకు కనిపించే భక్తులలో కాకాసాహెబ్ దీక్షిత్ సర్వోన్నతశ్రేణికి చెందినవారిగా కనిపిస్తారు. అసలు చరిత్రలో ఆయన ప్రవేశించడమే ఒక అద్భుత సంఘటన.

లండన్‌లో రైలు ఎక్కుతుండగా తగిలిన దెబ్బ వలన కాకాసాహెబ్ కాలు వంకర వచ్చింది. సాయిబాబా దగ్గరకు వెళితే ఆ కుంటితనం సరి చేస్తారని నానాసాహెబ్ చందోర్కర్ సలహా ఇచ్చారు. సాక్షాత్ పరమేశ్వరుని చెంతకు వెళ్లి ఏదో ఒక ఐహికకాంక్షను వెలిబుచ్చటం కేవలం అవివేకం. ఈ గ్రహింపు తన సుకృతం వలన కాకాసాహెబ్‌కు కలిగింది.

"ఇవ్వాళ వంకర తీసి సరిచేసినా రేపు ఎలాగు ఆ కాలు కట్టెల్లో కాలక మానదు. అందుచేత నా బుద్ధి వంకర తీర్చు బాబా" అని ప్రార్థించాడు.

వకీలు వృత్తి ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్న దశలో ఉన్నారు కాకాసాహెబ్. బాబా సన్నిధిలో అతనిలోని ఆరాటాలను, ఐహిక ఆందోళనలను అణచివేసింది. వృత్తి విడిచిపెట్టి బాబా చెంతనే ఉండడం ప్రారంభించాడు.

ఒక కేసు అక్కడకే వచ్చింది. బాబా ఆజ్ఞ మేరకు ఆ కేసు వాదించగా ఒక పెట్టె నిండా వెండినాణేలు ఫీజుగా వచ్చాయి. ఆ పెట్టె మొత్తం బాబా ముందుంచారు దీక్షిత్.

"ఇవి నాకేనా?" అని అడిగారు బాబా.

దీక్షిత్ "తమది తమకు సమర్పిస్తున్నాను" అనగానే ఆయన దోసిళ్లతో ఆ డబ్బు తీసి అక్కడున్న వారందరికీ పంచారు. క్షణంలో పెట్టె ఖాళీ అయింది.

అప్పుడు అక్కడే ఉన్న కపర్దే తన డైరీలో "తన కష్టార్జితాన్ని బాబా అలా పంచేస్తుంటే దీక్షిత్ మొహాన ఏ కొంచెం సంచలనంగానీ, బాధ గానీ కనిపించలేదు" అని వ్రాసుకున్నాడు.

అటువంటి నిర్లిప్తస్థితిని ధనం పట్ల సాధించగలిగారు దీక్షిత్. అంతే కాక తానంత ధనవంతుడై ఉండి కూడా బాబా ఇచ్చిన భిక్షా పాత్ర పట్టుకొని ఇల్లిల్లూ తిరిగి భిక్ష తేవడానికి ఏమాత్రమూ సంకోచించలేదు సరికదా- అది మహద్భాగ్యంగా పొంగిపోయాడు.

బాబా ఒకసారి అతన్ని మేడ దిగి రాకుండా వాడాలోనే తొమ్మిది నెలల పాటు ఉండి, కేవలం తననే ధ్యానిస్తూ ఉండమని శాసించారు. దీక్షిత్ సాధన ప్రారంభించారు.

ఎంతకాలానికీ ఇంటికి రాని భర్త కోసం తన భార్య వెతుక్కుంటూ వచ్చిందని విన్నప్పుడు కూడా అతను చలించలేదు. ఇలా ఆమె వచ్చిందని బాబాకు ఆయన కబురు పంపించగా "నీవు మేడ దిగి రానవసరం లేదు" అని సమాధానం పంపారు బాబా.





ఇక అంతే! దీక్షిత్ ఆ ఆజ్ఞను తలదాల్చాడు.

ఒక్కసారి తన భర్తను చూచి వెళ్తానని దీక్షిత్ భార్య బాబా దగ్గర విన్న వించుకొంటే 'అతని' పూర్తి బాధ్యత నాదే, నీవు నిశ్చింతగా వెళ్లిపో" అన్నారు ఆయన.

దీక్షిత్ భార్య కన్నీళ్లతో వెళ్లిపోయింది.

అంత దీక్షతో తొమ్మిది నెలలు పూర్తి చేసినందుకుగాను కొన్ని ఆధ్యాత్మిక శక్తులు వచ్చాయి కూడా. రాబోయే వ్యక్తులు, జరగబోయే కొన్ని సంఘటనలు ఆయనకు ముందుగానే తెలుస్తుండేవి. కాకా దారేషణను, ధనేషణను జయించడమే కాదు పుత్రేషణను కూడ జయించాడు.

కొంతకాలం తర్వాత కాకా భార్య కూడ పిల్లలతోసహా అక్కడికే వచ్చేసింది. అంతా బాబా సేవలోనే ఉండసాగారు.

హఠాత్తుగా దీక్షిత్ బిడ్డ కొద్దిపాటి అనారోగ్యంతో బాబా ముందరనే ప్రాణాలు వదిలింది. దీక్షిత్ భార్య "ఈయనను సేవించి ఏమి లాభం!" అని దుఃఖించింది.

దీక్షిత్ మాత్రం 'తన సొమ్ము తాను తీసుకుంటే నాకేమి!" అన్నంత నిర్లిప్తంగా, గంభీరంగా ప్రవర్తించాడు.

బాబా ఒకసారి చావుబ్రతుకుల్లో ఉన్న ఒక మేకను నరకమని బడే బాబాను ఆజ్ఞాపించారు. "దాన్ని చంపడమెందుకిప్పుడు?" అంటూ అల క్ష్యంగా ఊరుకున్నాడు బడేబాబా.

శ్యామా వైపు తిరిగింది ఆజ్ఞ.

అతడొక కత్తి తెచ్చాడు కాని ఈ కబురు రాధాకృష్ణమాయికి తెలిసి తన కత్తి హింసకు ఉపయోగపడకూడదని వెనక్కు తెప్పించుకున్నది. మరో కత్తి కోసం వెళ్లిన శ్యామా కాస్తా తాత్సారం చేసాడు.

అపుడు బాబా దీక్షిత్‌ను పిలిచి మేకను నరకమన్నారు. ఆయన వెంటనే అందుకు సంసిద్ధమైపోయాడు.

"ఏమయ్యా, బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి హింస చేస్తావా?" అన్నారు బాబా.

అప్పుడు దీక్షిత్ అన్న మాటలు శిష్యులై సాధకులు కాదలచుకొన్న ప్రతి వారికీ శిరోధార్యాలు.

"అమృతము వంటి నీ పలుకే మాకు చట్టం, ఇంకొక చట్టమేదీ మాకు తెలియదు. ఎల్లప్పుడు నిన్నే జ్ఞప్తియందుంచుకొంటాం, నీ రూపాన్ని ధ్యానిస్తూ, నీ ఆజ్ఞను పాటిస్తాం. అది ఉచితమా? కాదా? అన్నది మాకు తెలియదు. దాన్ని గూర్చి మేము వాదించం, తర్కించం. గురువాజ్ఞ అక్షరాలా పాటించడమే మా విధి, మా ధర్మం".

సర్వశ్రేష్ఠ స్థితికి రాదలచిన శిష్యులందరికీ కాకాసాహెబ్ దీక్షిత్ ఆదర్శ ప్రాయుడయ్యాడు ఈ సంఘటనతో.

బాబా శరీరం విడిచిన తర్వాత కూడ దీక్షిత్, శ్యామా మొదలైన సహ శిష్యులతో కలిసి బాబా గురించే ధ్యానిస్తూ, మాట్లాడుతూ ఉండేవారు.

ఆయన మరణం కూడ చిత్రంగానే జరిగింది.

శ్యామాతో కలిసి రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. ఇద్దరూ బాబా గురించే మాట్లాడుకొంటున్నారు. ఉన్నట్లుండి దీక్షిత్ శ్యామా భుజం మీదికి ఒరిగి పోయాడు. నిద్రపోతున్నాడనుకొని కదిలించి చూస్తే ఆయన ప్రాణం విడిచాడని తెలిసింది.


ఆ విధంగా కాకా రావడమే ఒక మహోన్నత లక్ష్యంతో వచ్చాడు. తనకున్న సంపత్తి, సంసారం, సంతానం మొదలైన వాటి మీద వ్యామోహాన్ని అవలీలగా వదిలివేసుకోగలిగాడు.

గురుచరణ ఛాయలో ఎంత నిశ్చింతగా బ్రతకవచ్చో, అంత అనాయాసంగా మరణించవచ్చు కూడ అని ఋజువు చేసారు.

అటువంటి మహనీయుడు కాకాసాహెబ్ దీక్షితును గురించి బాగా చదివి, మననం చేసుకొని, అనుసరించి ధన్యులమవుదాము.







# అసూయ

- శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారు

ఒక మహావృక్షము కలదు. అది శాఖోపశాఖలుగా విస్తరించి ఫలపుష్ప సమన్వితమై కళకళలాడుచు, చూపరులకు పరమానందం గొల్పుచుం డెను. ఆకస్మాత్తుగా ఒక దినమున అది శుష్కించిపోయెను, కారణం ఎవరికినీ బోధపడకుండెను.

సర్వాంగ సుందరమై, విలసిల్లు ఆ వృక్ష రాజమున కట్టి దీనదశ ఏల సంభవించెనో జనులకు విదితము కాలేదు. అత్తరి యొక వృక్ష శాస్త్రజ్ఞుడు అచటికేతెంచి యా పాదమును చక్కగ పరీక్షించి, దాని జీర్ణదశకు కారణ మరసెను. ఒక వేరుశెనగ పురుగు లోన ప్రవేశించి, ఆ చెట్టును లోపల లోపలనే గుల్లచేసి వైచెను. అది అసలు సంగతి.

అట్లే కొందరు వ్యవహార రంగమునకు, మరికొందరు పరమార్థ క్షేత్రమునకు తమ ప్రయత్నాతిశయముచే మహోన్నత స్థితిని చేపట్టినను, గొప్ప స్థానమలంకరించినను, ఆకస్మాత్తుగా పతనమైపోవుచున్నారు. దీనికి కారణమేమి?

వారిలో ఒక వేరుపురుగు ప్రవేశించుచున్నది. అదియే అసూయ. అది ప్రవేశించి వారిలోనున్న సద్గుణరాశినంతను బూడిదపాలు చేసి వైచుచున్నది. అపుడు మానవుడు దానవుడుగా రూపొందుతున్నాడు. కాబట్టి ముముక్షువులీ పరమశత్రు విషయమై కడు జాగరూకులై మెలంగి అద్దానినెన్నడును దరికి జేరనీయక చూచుచుండవలెను.

జనులలో మూడు తరగతుల వారు కలరు. కొందరు పరుల ఔన్నత్యము నకు కారకులై, వారి వృద్ధినొందుటను జూచి పరమానందపడుచుందురు - వీరు మధ్యమ తరగతి వారు. వీరివలన పరులకు ఉపకారం లేకపోయి

నను, అపకారం కూడ లేదు. కావున ఒక విధంగా మంచివారే యగుదురు.

ఇక మూడవ తరగతి వారు తాము ఉన్నతిని పొందక పోయినను ఒకరి ఔన్నత్యమును జూచి ఓర్చలేరు-వీరు అధములు. ఇట్టి అసూయ పరుల వలన సంఘమునకు తీరని కళంకం సంభవించుచుండును. ఇది చాలా హేయమైన ప్రవర్తన. అసూయాగ్రస్తుని బాధకు వేఱు కారణ మేమియు ఉండదు. ఒకరు బాగుపడుటయే అతని ఏడుపుకు కారణం.

దుర్గుణములన్నిటిలోను ఈ అసూయ మహా ప్రమాదకరమైనది. శ్రీకృష్ణ భగవానుడు -

1) ఇదంతుతే గుహ్యతమం ప్రవక్షాష్య సమాయనే

2) న చాశుశ్రూషవే వార్యం సచమాం యోతి భ్యసూయతి.

అని గీతయందు వచించినవాడై అసూయాపరులకు పవిత్రమైన శాస్త్రమును బోధించినను నిరుపయోగమగునని సూచించెను. అసూయ అనునది ఒక విధమైన కల్లు. అది త్రాగిన వారికి మంచి చెడ్డ తెలియదు. సర్వభూతములందు వెలుగుచున్న పరమాత్మను వారు గ్రహించజాలరు. పరుల సుఖమును జూచి ఓర్చలేకుందురు.

పాత్ర మంచిది, పప్పు మంచిది, చింతపండు మంచిది, నీళ్ళు మంచివి, నిప్పు మంచిది, వండినవారు దక్షులు, అయినను వండిన పప్పు పులుసును త్రాగి అందరూ వాంతి చేసుకొనిరి. కారణమేమి?

ఈ పాత్రకు లోపల కళాయి లేదు. అదే విధంగా ఎన్ని సుగుణము లున్నను ఒక్క అసూయయను దుర్గుణమున్నచో ఆ వ్యక్తి లోకమునందు పతనమైపోవును. భగవద్రేష్టయందు అతడు క్రమంగా తన పూర్వపు ఔన్నత్యమును గోల్పోవుచుండును.





ఇక, అసూయకు కారణమేమియో విచారించెదము. అజ్ఞానమే దానికి కారణము ఎదుటివారు, తాము వేఱువేఱని తలంచుటయే ఆ దుర్గణము నకు హేతువు. సర్వులయందును ఒకే భగవత్స్వరూపము వెలుగుచున్నదని తెలిసినపుడు, తన ఆత్మయే సర్వభూతాత్మయని గ్రహించినపుడు ఇక పరులను ఏం హింసించును? పరుల అభివృద్ధిని జూచి ఏల దిగులు నొందుచుండును?

యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవా భూద్విజానతః

తత్రకో మోహః క శోక ఏకత్వ మనుపశ్యతః

అను ఈశావాస్యోపనిస్మంత్రమీ సత్యమునే వెల్లడించుచున్నది. "ఓ జీవులారా! సమస్త ప్రాణికోట్లయందును మీ హృదయాంతర్వర్తి యగు ఆత్మయే విరాజిల్లుచున్నదని తెలిసికొనినపుడిక కామముగాని, క్రోధము గాని, శోకముగాని, అసూయగాని ఏల కలుగగలదు?" అని ఆ ఉపనిషత్తు జనులను నిలదీసి అడుగుచున్నది.

కాబట్టి సర్వాత్మ భావమును చక్కగా అలవఱచుకొని సర్వత్ర ఏకత్వానుభవము గలవారై జనులు తమయందలి ఈ అసూయాది పరమ శత్రువులను పారద్రోలి జీవితమును నిష్కంటకముగ, శాంతిమయ ముగ, పరమానంద ప్రదముగ నొనర్చుకొందురు గాక!

**నాకు తెలిసిన దొక్కటేనయ్య సాయి**
**నాథ! సాయి సాయి యను నీ నామమింక**
**విడువ బోక జపింతు వేవేలమార్లు**
**సుంత దయజూపి నిలుపునీ చెంత నన్ను!**



# నారద గర్వభంగం

- శుకవాణి

**(గత సంచిక తరువాయి)**

"అదుగో చూడు" అన్నాడు శ్రీహరి వేలితో ఒక పల్లెలోని ఒక గుడిసెవైపు చూపిస్తూ. ఆ గుడిసె ఒక పేద రైతుది. అతను ప్రొద్దున్నే లేచి మంచం మధ్యనే కూర్చొని నారాయణ నామస్మరణం చేసుకుంటున్నాడు. "ఈ రైతా?" అన్నాడు నారదుడు అనుమానంగా. "ఆఁ! అతనే రోజంతా అతనేం చేస్తున్నాడు" అన్నాడు విష్ణుమూర్తి. నారదుడు ఇంక వైకుంఠం వదిలి భూలోకంలో రైతు వెంటబడ్డాడు. ఆయన ఏంచేసేదీ పరిశీలించసాగాడు. రైతు ఓ పది నిముషాలపాటు అలా నామస్మరణం చేసిన తర్వాత లేచి కాలకృత్యాలు తీర్చుకోవటం, చద్ది అన్నం తినటం, ఆ తర్వాత ఎడ్లను విప్పుకొని, నాగలి భుజాన వేసుకొని పొలానికి వెళ్లటం, సాటి రైతులతో మాట్లాట్టం. అలా అలా తన పనులలోనే నిమగ్నుడైపోయాడుగానీ 'నారాయణ' అన్న మాటే అనలేదు.

సరే-మధ్యాహ్నం అన్నం తిన్నాడు. మళ్లీ పని - ఆ తరువాత చీకటిపడు తోంటే ఇంటికి వచ్చాడు. రాగానే పశువులకు మేతా, నీళ్లూ చూచాడు. స్నానం చేసాడు. ఆరు బయట మంచం వేసుకొని పడుకొని తన రెండేళ్ల కొడుకునీ, నాలుగేళ్ల కూతురినీ బొజ్జ మీద కూర్చోబెట్టుకొని కథ చెప్పాడు. ఆ తర్వాత వెన్నెల్లో కూర్చొని భార్యాబిడ్డలతో కలిసి అన్నం తిన్నాడు. అంతా అయిపోయాక పడుకొని "నారాయణా! నారాయణ" అని ఓ పదిహేనిరవై సార్లు అన్నాడో లేదో నిద్ర వచ్చేసింది కాబోలు నామస్మరణ బదులు గురుక ధ్వని వినిపించసాగింది.

నారదునికిదంతా చూస్తే చిర్రెత్తుకొచ్చింది. వెంటనే మళ్లీ శ్రీహరి దగ్గరకే వెళ్లాడు. జరిగిందంతా చెప్పి, "ప్రొద్దున్న నిద్రలేస్తూ నాలుగు సార్లూ,





రాత్రి పడుకోంటూ నాలుగు సార్లూ, నిన్ను తలుచుకొంటే చాలా! గొప్ప భక్తుడైపోయాడా?" అన్నాడు కాస్త కోపంగా. "మరి, నేను క్షణక్షణం నిన్నే స్మరిస్తానే! అదంతా వ్యర్థమేనా" అని కూడా అన్నాడు.

'సరే ఆ గొడవ యింక వదిలెయ్యి, అసలు నీకివ్వాళ ఒక గొప్ప పని అప్పగించాలనుకొన్నాను. మర్చిపోయాను" అన్నాడు శ్రీహరి. ఏమిటా పని! చెప్పండి స్వామీ! అన్నాడు నారదుడు. గొప్ప పని అనగానే ఉత్సాహపడుతూ.

"రా, చెప్తాను - ఇదుగో ఈ గిన్నె నిండా యీ తైలం నింపాను చూడు-ఇది ఉత్తుత్తి నూనె కాదు సుమా! లోకంలో ఉన్న వ్యాధులన్నీ పోగొట్టగల శక్తి దీనికి ఉంది. ఒక్కసారి యీ తైలపాత్రతో నీవు ప్రపంచ మంతా ప్రదక్షిణం చేసిరావాలి. దానితో ప్రపంచానికి పట్టిన పీడ విరగడై పోతుంది. అంతా హాయిగా, సుఖంగా ఉంటారు. నీ పేరే చెప్పకుంటారు. నీకెలాగూ లోక సంచారం అంటే యిష్టమేగా! మరి ఓసారి యీ పాత్రను తిప్పకొని వస్తావా?" అన్నాడు శ్రీహరి.

అంతటి మహత్కార్యం-ఎంతటిదీ? ప్రపంచంలో అందరి రోగాలూ పోగొట్టటం అన్న గొప్ప పని తన వలన కాబోతున్నందుకు నారదుడు పొంగి పోయాడు. ఎంతో గౌరవంతో శ్రీహరి దగ్గర ఆ పాత్ర అందుకొని, బయలు దేరాడు యాత్రకు. అతనొక్క అడుగు వెయ్యగానే శ్రీహరి "ఆఁ ఆఁ ఆగాడు నారదా!" అన్నాడు. ఆయన వెంటనే ఆగిపోయి "ఏమిటి స్వామీ!" అన్నాడు.

"అసలు విషయం చెప్పటం మర్చిపోయాను సుమా! ఇది ఎంత గొప్ప పనో అంత ప్రమాదకరమైన పనికూడా. ఈ నూనెలో చాలా శక్తిఉన్నదని చెప్పాను గదా! ఇందులోంచి ఒక్క చుక్క నూనె క్రింద పడిందా-ఇంక అంతే-ఆ ప్రాంతంలో ఉన్న సర్వజీవరాశీ మలమలమాడి చచ్చిపోతుంది. రెండు మూడు చుక్కలు ఒక్కసారి తొణికిపడ్డాయంటే అసలు మొత్తం ప్రపంచమే నాశనమైపోతుంది. అంచేత నీవు చాలా జాగ్రత్తగా వెళ్లాలి సుమా!" అన్నాడు శ్రీహరి.

“ఓ అలాగే స్వామీ! అయినా నీ నామం నాకు తోడుగా ఉంటే నాకివన్నీ లెక్కా ఏమిటి?” అన్నాడు నారదుడు సగర్వంగా ముందుకు కదులుతూ. శ్రీహరి నవ్వి ఊరుకున్నాడు. సరే. మన నారదుడు బయలుదేరాడు. ఒక్కొక్క ఊరూ దాటుతున్నాడు. నదులు, కొండలు, గుట్టలు, చేలు, అడువులు, ఎన్నెన్నో దృశ్యాలు ఎదురవుతున్నాయి. మామూలుగా నారదుడికి అందమైన దృశ్యాలంటే ఎంతో యిష్టం. వాటిని చూస్తూ, వాటిని సృష్టించిన నారాయణుని స్మరిస్తూ తిరుగుతుంటాడు. ఇప్పుడు మరీ చేతిలో నూనె గిన్నె ఉంది గదా! తన చూపు, ధ్యాస అంతా చేతిలో గిన్నె మీదా, ముందున్న దారి మీదే ఉన్నాయి. ఏ రాయైన తగిలి తన కాలు బెణికితే-చెయ్యి కదులు తుంది. గిన్నె తొణుకుతుంది. నూనె ఒలుకుతుంది. అమ్మో! ఎంత ప్రమాదం! అంచేత నారదుని మనస్సంతా ఆ గిన్నె మీదనే ఉందిగానీ చుట్టూ ఏమీ చూడ్డం లేదతను. రామావతారపు అయోధ్య, కృష్ణుని ద్వారక, రాధమ్మ వ్రేపల్లె అలా అలా అన్ని ఊళ్లూ దాటుకు వెళ్లిపోతున్నాడు.

అలా నారదుడు ఒక పూర్తి రోజంతా తిరిగి తిరిగి ప్రపంచ ప్రదక్షిణం పూర్తి చేసాడు. తిరిగి తైల పాత్రను భద్రంగా పట్టుకొని వెళ్లి శ్రీహరి ముందు నిలబడ్డాడు. “అరె! అప్పడే వచ్చేసావే! ఆలా వేగంగా తిరిగావన్నమాట! శెభాష్!” అన్నాడు శ్రీహరి. నారదుడు వినయంగా తలవంచుకొని, లోలోపలే గర్వపడ్డాడు. నీలాంటి భక్తుడుండటం వలన నాకివ్వళ బోలెడంత శ్రమ తప్పింది” అన్నాడు మళ్లీ శ్రీహరి. నారదుడు సంతోషంగా నవ్వి ఊరుకున్నాడు. “మరి నీవింక వెళ్లిరా!” అన్నాడు శ్రీహరి మళ్లీ. నారదుడు నమస్కరించి బయలుదేరాడు. మెల్లగా శ్రీహరి దగ్గరగా వెళ్లి,

అన్నట్లు నిన్నో ప్రశ్న అడగాలి నారదా!” అన్నాడు. “అడగండి స్వామీ!” అన్నాడు నారదుడు.

“ఎవరైనా దైవనామస్మరణతో ఆరంభించి, అలాగే ముగిస్తే గానీ మంచి ఫలితం ఉండదని నీకు తెలుసు గదా! ఇవ్వేళ నన్నెన్నిసార్లు తలుచు





కున్నావు నారదా!” అని అడిగాడు స్వామి. నారదుడు నిశ్చేష్టుడైపోయాడు. ఇదేమిటి ఒక్క క్షణమైనా స్వామి పేరు విడువని తాను రోజంతటిలోనూ ఒక్కసారైనా స్మరించలేదేమిటి! అదుగో ఆ వెధవనూనె గిన్నె మూలాన యిలా జరిగింది. నారదుడు తనలోతానే సిగ్గుపడ్డాడు. తలవంచుకొని, “క్షమించండి స్వామీ! నా ధ్యానమంతా నూనె గిన్నె మీదనే ఉండిపోయింది” అన్నాడు మెల్లని గొంతుతో.

శ్రీహరి మెత్తగా నవ్వాడు. “ఇప్పడైనా అర్థం అయిందా? ఆ పేద రైతు రోజంతా అతని పనులలో మునిగి ఉంటాడు. ఒళ్ళు విరుచుకుని కష్ట పడతాడు-అయినా తన దినచర్య అంటే రోజువారీ పనిని నా స్మరణతోనే ఆరంభిస్తాడు. నా స్మరణతోనే ముగిస్తాడు. ఆ బలం అతన్ని రోజంతా కాపాడుతుంది. అందుకే అతను స్మరించగానే నేను పరుగున వెడతాను, నీవు పండితుడివి-జ్ఞానివి-అతను అవివేకి-చదువు రానివాడు. కానీ, ఎంతటి పని ఒత్తిడిలోనైనా నన్ను తలచి చెయ్యటం మాత్రం మర్చిపోడు. నీవు ఊరికే ఉన్నప్పడెల్లా నన్ను స్మరించేవాడివి. కానీ, యివ్వాళ చేతి నిండా పని దొరకగానే నన్ను మర్చిపోయావు కదూ!” శ్రీహరి కొంటెగా నవ్వాడు. నారదుడు సిగ్గుపడ్డాడు-

“క్షమించండి స్వామీ! ఇన్నాళ్ళూ నా అంత భక్తులు లేరని గర్వపడ్డాను. నాకు గర్వభంగమైంది” అన్నాడు.

అంచేత చిట్టి బాలలూ! ప్రతిరోజూ లేవగానే పది నిముషాలు కదల కుండా కూర్చొని మనకిష్టమైన దైవాన్ని తలుచుకుందాం. మళ్లీ పడుకొనే టప్పడు కూడా గుర్తు చేసుకుందాం. అప్పడాయన మనను వదలకుండా అంటిపెట్టుకొని కాపాడుతూ ఉంటాడు’ గుర్తుంచుకోండి మరి!

# జనన మరణ చక్రము

## మార్కండేయ మహాపురణం ఆధారంగా

- శ్రీ గురుదేవులు

రాజుగాని, రాజకీయ ఉద్యోగికాని, రాజభటుడుగాని, అధర్మముగా యితరులను దండించినప్పడు "సూకరముఖ"మనే నరకంలో త్రోయ బడతాడు. అతడక్కడ తిరుగలిలోని పిండి మాదిరిగా నుగ్గునుగ్గయిన అవయవాలతో బాధతో కేకలు పెడుతూ చితుకగొట్టబడుతూ ఉంటాడు.

ఎవడితరుల బాధను గుర్తింపక ఇతర జీవులను బాధిస్తూ ఆనందం పొందుతాడో వాడు 'అంధకూప'మనే నరకంలో కూలుతాడు. అతడక్కడ పశు, మృగ, పక్షుల చేత, పాముల చేత, తేళ్ళ చేత, దోమలు, నల్లులూ మొదలగు వాటిచేత ఆ భయంకరమైన చీకటిలో బాధింపబడుతూ ఉంటాడు. ఆ తరువాత నీచజన్మను ఎత్తి యిలాంటి బాధలే పొందుతూ ఉంటాడు.

ఎవడు తన అన్నమును, ధనమును మంత్రివిహితాలైన పంచయజ్ఞాల ద్వారా దేవతలకు, ఇతర జీవులకు ఈయక తానొక్కడే అనుభవిస్తాడో ఆ పాపి "కృమిభోజన" మను నరకంలో కూల్చబడతాడు. వాడక్కడ లక్ష యోజనాల వైశాల్యం గల కృమి కుండంలో పడి తానొక పురుగై అందలి పురుగులచేత తినివేయబడుతూ ఉంటాడు. అతిథులకు పెట్టకుండా తానే భుజించిన పాపి కూడ ఈ నరకంలోనే పడతాడు.

అనేకమంది స్త్రీలతో సంపర్కం పెట్టుకొన్న పాపిని ఇనుపముళ్ళతో నిండిన "శాల్మత నరకము"లో పడవేసి యమభటులు ఈడుస్తూ ఉంటారు. స్వధర్మాన్ని వదలిపెట్టిన జీవులు వైతరణీ తప్త జలాలతో నిండిన





గోతులలో పడి (చీమూ, నెత్తురు మొ.లగు వాటితో నిండిన) ఉక్కిరిబిక్కిరి ఔతూ ఉంటారు. అక్కడ అనేక జలజంతువులు వానిని తింటూ ఉన్నప్పటికీ ప్రాణాలు మాత్రం ఆ యాతనా శరీరాన్ని వదలిపెట్టవు.

భ్రష్టాచారపరులు, సిగ్గుమాలినవారు, సదాచార నియమాల్ని పాటించని పశువర్తనులు, మలమూత్రములు, శ్లేష్మ రక్తములు, మలము నిండిన యిటువంటి నదిలో కూల్చబడుటయేకాక యమదూతలు మలమూత్రములను ఆ పాపుల నోళ్ళలోనికి నెట్టుదురు.

ఏ ద్విజాతులవారు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) గాడిద, కుక్క మొదలైన జంతువులను పెంచుతారో, మృగాలను వేటాడుతారో వారిని యమ భటులు వాడి ములుకులతో పొడిచి బాధిస్తారు.

ఏ నరాదములు-డాంబికులు అగువారు దంభయాగముతో పశు వులను హింసిస్తారో వారు చచ్చిన పిమ్మట "విశసన" నరకంలో కూల్చబడతారు. అక్కడ భయంకరంగా కొరడా దెబ్బలు తింటూ ఉంటారు.

దొంగలను, ఇళ్ళకు నిప్పంటించువారిని, విషప్రయోగం చేసే వారిని, లంచగొండులైన రాజోద్యోగులను యమదూతలు "శ్వాసకాదన"మనే నరకంలో కూలుస్తారు. ఆ నరకంలో ఏడు వందల ఇరువదికి పైగా చిత్ర విచిత్రాలైన క్రూరమైన కుక్కలు గబగబ ఆ జీవులను పీక్కుతింటూ ఉంటాయి.

ఏ జీవులు లేచినది మొదలు అసత్యాలాడుతూ ఉంటారో, డబ్బులు ఇచ్చిపుచ్చుకోవటంలో కూడా అబద్ధాలాడుతూ ఉంటారో వారు చచ్చిన తరువాత "అవీచి" అనే నరకంలో పడతారు. అక్కడ యమభటులు వారిని నూరు యోజనాల యెత్తయిన పర్వతశిఖరాల నుండి క్రిందికి పడవేస్తూ బంతుల మాదిరి ఆడుతూ ఉంటారు. ఆ జీవుడు ఆకాశంలో క్రిందికి పడేటప్పడు నేల మీద నీళ్ళు లేకున్నా అలలు ఉన్నాయనే భ్రమ కలుగుతూ

ఉంటుంది. అక్కడ పడినవారు చిత్తు చిత్తుగా చితికిపోతూ ఉన్నా చావరు.

ఏ ద్విజుడు సురాపానము చేస్తాడో వాడు మరణించిన తరువాత నరకంలో యమభటులు వానిచేత వేడివేడి లోహపు ద్రవాన్ని త్రాగిస్తారు. అది ఎల్లప్పడూ నిప్పమంటలతో సలసల కాగుతూ ఉంటుంది.

ఏ నరుడు తనకు గౌరవపాత్రుడైన వానిని గౌరవింపడో తనకంటే విద్య-జన్మ-తపస్సు-వర్ణము-ఆశ్రమము-ఆచారములందు శ్రేష్ఠుడైన వానిని ఎవడు గౌరవింపడో వాడు "క్షార కర్దము"మను నరకంలో పడవేయబడి తలక్రిందులుగా వ్రేలాడుతూ ఘోర యాతనలననుభవిస్తూ ఉంటాడు.

ఏ నేరాలు, మోసాలు చేయకుండ సాధుజీవనం గడిపే పుణ్యాత్ములను మోసగించినా, ఏ రకంగానైనా బాధించి వినోదించినా ఆ పాపులు చచ్చిన తరువాత "శూలపాత" నరకంలో పడవేయబడతారు. అక్కడ వారు వాడి శూలాలచేత గుచ్చబడతారు. తీవ్రమైన ఆకలిదప్పలచే బాధపడుతారు, వాడి ముక్కులుగల కొంగలు మొదలైన పక్షుల చేత చీల్చబడతారు.

తమ తీవ్రమైన ప్రవర్తనతో ఇతరులకు ఉద్రేకపెట్టేవారు కాని, భయపెట్టే వారు కాని 'దండశూక' మనే నరకంలో పడతారు. అక్కడ ఐదుగాని, ఏడుగాని ముఖాలుగాని దండశూకముల (పాములు, రాక్షసులు)చేత మ్రింగబడి మరల వదలివేయబడుతూ బాధలననుభవిస్తారు.

కటిక చీకటిగా ఉండే గదులలో, గాదెలలో, బావులలో, గుహలలో జీవులను బంధించి బాధించే పాపులు దట్టమైన పొగమంటలు, విషపు మంటలు నిండినచోట్ల యమభటులచేత ఉక్కిరిబిక్కిరి చేయబడతారు.

తన ఆదాయ వ్యయములను గురించియే ఎల్లప్పడూ చింతిస్తూ బ్రహ్మరాక్షసుని మాదిరి, పిశాచమువలె ధనాన్ని కాపలాకాస్తూ ధర్మ కార్యాలకు వినియోగించుకొనకపోతే ఆ పాపిని "సూచీముఖ"మనే నరకంలో పడవేస్తారు. ఆ డబ్బు పిశాచము పట్టిన వానిని యమభటులు





గట్టిగా కట్టివేసి సాలెవారివలె అట్టి పాపుల శరీరముల నిండ గట్టి దారములతో నేత నేయుదురు. ఈ విధంగా జీవులు చేసే పాపకర్మలకు తగినట్లుగా ఎన్నోరీతుల నరక బాధలు ఉన్నాయి.

పాపి అయిన జీవుడు తాను జీవించి ఉండగా చేసిన వివిధాలైన పాపాలకు తగినట్లుగా రకరకాల నరకబాధలు అనుభవించి అక్కడ నుండి విముక్తుడై తిర్యగ్యోనియందు (నిలువుగా రెండు కాళ్ళపై కాక భూమికి సమాంతరంగా నడిచే, పాకే జీవులు) పుడతాడు. క్రమంగా ఆ జీవి కృమి, కీటకము, దోమ, పక్షి, పాము, బల్లి మొదలైన యోనులలోను, కొన్ని సందర్భాలలో వృక్షాలు, లతలుగాను, ఎద్దు, గుర్రము, ఏనుగు మొదలైన జంతువులుగాను జన్మించి అనేక కష్టాలను పొందుతుంది. చిట్టచివరకు మనుష్యజన్మ పొందినా వికారిగా, నపుంసకుడిగా, కుత్సితుడుగా, చండాలుడుగా, పుల్కసుడుగా జన్మిస్తాడు.

అటుపై మళ్ళీ పాపాలు మూటగట్టుకోకుండా ధర్మమార్గంలో జీవిస్తూ ఉంటే క్రమక్రమంగా సంచిత పాపాలు తగ్గుతూ మంచి జన్మలు పొంది చివరకు స్వర్గాన్ని కూడా చేరగలరు.

అక్కడ పుణ్యం క్షీణించగానే వారివారి గత జన్మల వాసనాబలం చేత (అంటే గత జన్మలలో వారికి గల వ్యామోహాలను బట్టి) ధనవంతుల యిండ్లలోనో, మహాత్ముల ఇండ్లలోనో జన్మిస్తారు. అప్పడు సదాచారాలు పాటిస్తూ, వివేక వైరాగ్యాలతో జీవిస్తే పునరావృత్తి రహితమైన మోక్ష సామ్రాజ్యాన్ని కూడా పొందగలరు.

ఓం సాయిరాం - శ్రీ సాయిరాం

జయజయ సాయిరాం -- జయ సాయిరాం

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఒకవైపు ఆకలి బాధను భరించలేక మరియొక వైపు ప్రజలు పెట్టే కష్టాల నోర్చుకోలేక షిరిడీ వీడి ఎక్కడికైనా వెళ్ళిపోదామని తలంచి తనకు గల ఒక జత బట్టలను, పుస్తకాలను మూటగట్టుకొని కాలినడకన షిరిడీ పొలిమేరలు దాటారు. మధ్యాహ్న సమయం వరకు నడక సాగించి అలసి, సొలసిన స్వామీజీ ఒక చెట్టు క్రింద సేద తీరుతూ నిద్రలోకి జారుకున్నారు. సాయంకాల సమయానికి అలసట తీరి నిద్ర మేల్కొంచి చెట్టు పైకి చూడగా అచట బాబా చిత్రపటమొకటి వ్రేలాడుతూ అగుపించెను. తాను నిద్రించుటకు ముందు లేని ఈ బాబా చిత్రపటం ఎక్కడ నుండి వచ్చినది, ఇదేమి విచిత్రమని తలపోస్తూ దాహం తీర్చుకోవటానికి ఆ చెట్టు చెంతనే గల బావిలోనికి చూడగా నీరు పుష్కలముగా పైకే ఉన్నవి కాని చేతికి అందేరీతిన లేవు. చెట్టు కొమ్మ మీద నుంచి బావిలోనికి వంగి చెంబుతో నీరు అందుకోవచ్చని తలంచిన స్వామి తన జోలెలో చెంబు కోసం గాలించగా అది కనిపించలేదు. దీని సారాంశాన్ని స్వామి తాను బాబాకు దూరంగా వెళితే నీరు కూడ లభించవని ఇదంతా బాబా లీలయేనని గ్రహించి వెనువెంటనే షిరిడీకి తిరుగు పయనము సాగించి ఆ రాత్రికే షిరిడీ చేరి తాను చేసిన తప్పిదమునకు సాయినాథుని మనసారా క్షమించమని వేడుకొని తిరిగి తమ నిత్యకృత్యములను కొనసాగించెను.

ఒక పర్యాయము స్వామీజీ వస్త్రాలు జీర్ణమైపోయి కట్టుకున్న వస్త్రంతో మిగిలారు. ఆ వస్త్రమును శుభ్రపరచు కొనవలెనన్నను వేరొక వస్త్రము లేక ఒండొరులను యాచించుట తెలియని స్వామి తన కష్టసుఖములను బాపువాడు బాబాయే నన్న ధృడ విశ్వాసముతో బాబాకు తన గోడు





చెప్పకుని లెండీబాగ్‌లో ధ్యానస్తులాయెను. ఆ ధ్యానములో ఒక అపరిచిత వ్యక్తి తనకు నూతన వస్త్రాలను బహూకరించినట్లు అనుభూతి కలిగెను. ధ్యానం ముగిసిన పిదప కొద్దిక్షణాల్లోనే ఒక వ్యక్తి వచ్చి స్వామికి రెండు నూతన వస్త్రములను సమర్పించి తనకు బాబా స్వప్నంలో దర్శనమొసంగి లెండీబాగ్‌లో ధ్యానమొనరించుకొనుచున్న వ్యక్తికి నూతన వస్త్రములను బహూకరించమని ఆదేశించగా తాను ఆ వస్త్రములను సమర్పిస్తున్నట్లు విశదీకరించి వాటిని స్వీకరించమని స్వామిని వేడుకొనెను. వాటిని బాబా ప్రసాదముగా తలంచి ఆ వస్త్రములను బహూకరించిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలియజేసి వాటిని స్వీకరించి వాటికి మూలకారణమైన బాబాకు కృతజ్ఞతలు తెలుపుకొనెను.

మరొక పర్యాయము స్వామీజీ దుస్తులు మురికితో మాసిపోగా ఉతుక్కోవటానికి సబ్బులేక కొనుక్కోవటానికి డబ్బులేక లెండీబాగ్‌లో అదే ధ్యాసతో ఆలోచిస్తూ కూర్చున్నారు. అది సాయంకాల సమయం. సూర్యు డస్తమించే సమయం. చల్లని వాతావరణం ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. స్వామీజీ ఆ ప్రశాంత వాతావరణంలో బాబా నామస్మరణ చేసుకుం టూండగా ఒక ఆవుల మంద లెండీబాగ్ నుండి బయటకు వెళ్లింది. అవి వెళ్లిన తరువాత చూస్తే ఒక గోవు పాద ముద్ర మీద క్రొత్తది బట్టలు ఉతుక్కునే సబ్బు దొరికింది. గోవులు వెళ్లిన తరువాత ఎవ్వరు అటువైపు రాలేదు అటువంటప్పుడు ఈ సబ్బు అచటకు ఎలా వచ్చింది? అని స్వామీజీ ఆలోచించగా అదంతయూ బాబా లీలయేనని బోధపడింది. ఆ సబ్బుతో బట్టలు శుభ్రపరచుకున్నారు. ప్రతి చిన్న విషయానికి సాయినాథుడు స్వామికి అండదండగా నిలచి "నేనుండగా భయమేల?"యని స్వామి కష్టాలను కడతేర్చేవారు.

ఒకరోజు స్వామీజీ సమాధి మందిరంలో ధ్యానమొనరించుకొను సమయంలో ఆయన బట్టలు (ఒక తుండు), ఆధ్యాత్మిక గ్రంథాలు దొంగి

లింపబడెను. స్వామీజీ కట్టుబట్టలతో మిగిలారు. దీనికి స్వామీజీ ఏమాత్రం విచారించలేదు. "నాకు చేదోడు వాదోడుగ బాబా ఉండగా నాకేమి?" యని నిశ్చింతగా లెండీబాగ్‌లో ఆశీనులై ధ్యానమొనరించసాగెను. ధ్యానంలో ఒక అపరిచిత వ్యక్తి తనకు బాబాకు అలంకరించినటువంటి వస్త్రం ఇస్తున్నట్లుగా భ్రమ కలిగింది. ఒక అర్ధగంట గడచిన తరువాత ఒక వ్యక్తి స్వామీజీ ధ్యానంలో కనబడినటువంటి వస్త్రాన్ని బహూకరించాడు. మరికొద్ది క్షణాలకే వేరొకతను వచ్చి స్వామీజీకి వస్త్రాలు బహూకరించిన వ్యక్తికి నూతన వస్త్రాలనిచ్చి వెళ్ళిపోయాడు. స్వామీజీకి మొదట వస్త్రాలనిచ్చిన వ్యక్తి బాబా స్ఫూర్తితో తాను స్వామికి వస్త్రాలనివ్వగా బాబాయే స్వయంగా తనకు నూతన వస్త్రాలను ప్రసాదించాడని పరమానంద భరితుడయ్యాడు. ఆ ఆనందంలో స్వామికి భోజనం కూడా పెట్టించాడు. ఆపదలో నున్న వారిని, మంచి వారికి మనం సహాయం చేస్తే భగవంతుడు ప్రసన్నుడై తన కృపార్ణవాన్ని మనపై కురిపిస్తాడని ఈ సంఘటన స్పష్టము చేయుచున్నది. స్వామికి వస్త్రాలను సమర్పించిన వ్యక్తి తన గ్రామములో బాబా మందిరం నిర్మించదలచి బాబా ఆశీస్సులకై షిరిడికి వచ్చాడు. బాబా ఆశీర్వాదం లభించే వరకు అన్నపానీయములు ముట్టనని నిరాహారదీక్షను ప్రారంభించెను. "నా భక్తులను ఎన్నడును పస్తులుంచను" అని అభయ మిచ్చిన బాబా తన మందిరము నిర్మించదలచిన భక్తుని పస్తులుంచు తారా? ఆ మరుసటి రోజే ఆ భక్తుని సంచిలో రెండు రజిత నేత్రములు లభ్యమవ్వగా అదే బాబా ఆశీర్వాదమునకు చిహ్నమని స్వామీజీ తెలియ జేయగా అతను నిరాహార దీక్షను విరమించి తన స్వగృహమునకు పయనమాయెను.

ఒక పర్యాయము అనేక దినములు పస్తులుండుటచే స్వామీజీకి కడుపులో మంటరాగా పెరుగు త్రాగుదామనుకుంటే డబ్బులేక వేరే మార్గమేమి లేక గత్యంతరము లేక షిరిడీ సాయి స్టోర్స్ యజమాని నడిగి ఒక రూపాయి అప్పు తీసుకుందామని వెళ్ళగా ఆ షాపు యజమాని లేని కారణముగా గుమాస్తా స్వామికి అప్పివ్వ నిరాకరించాడు. ఏ దిక్కులేని





వాడికి దేముడే దిక్కని తనను ఎల్లవేళల కంటికి రెప్పవలె కాపాడుచున్న బాబాయే తనకు రక్షయని తలంచి లెండీబాగ్‌కు వెళ్ళి అచట గల కాలువలో ముఖప్రక్షాళన గావించుకొనుచుండ ఆ నీళ్ళలో అర్ధరూపాయి నాణెం ఒకటి, పావలా నాణెం ఒకటి, బేడ నాణెం ఒకటి, రెండు అణా కాసులు మొత్తం రూపాయి లభించినవి. తనను ఆపద నుండి రక్షించుటకు బాబాయే ఈ రీతిగా తనకు కావలసిన ధనమును సమకూర్చాడని అవగతము చేసుకున్న స్వామీజీ బాబాకు కృతజ్ఞతా పూర్వక నమస్కారములు తెలియజేసుకుని ఆ రూపాయితో పెరుగు త్రాగగా బాధ నివారణ కలిగింది. సాయిని ఎంత ధృఢ భక్తితో కొలిస్తే అంత వేగిరమే మన మనోవాంఛలు నీడేరుస్తాడని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

స్వామీజీ షిరిడీ వచ్చిన ప్రథమంలో తమ బట్టలను ఎల్లప్పుడు తెల్లగా ఉండేటట్టు శ్రద్ధ వహించేవారు. కానీ ద్వారకామాయిని శుభ్రపరచేటప్పుడు, దీపాలను శుభ్రపరచేటప్పుడు బట్టలకు నూనె మరకలై మురికిఅయ్యేడివి. కొన్నిరోజులు గడచిన పిదప వస్త్రాలను తెల్లగా ఉంచుకొనుటకంటే మనస్సును స్వచ్ఛంగా ఉంచుకోవాలని గ్రహించి బట్టల యందు శ్రద్ధ చూపేవారు కాదు. ఏ భక్తుడైనను బట్టల మురికిని గురించి ప్రశ్నించగా ఇది మురికి కాదు మన పాపాలను ప్రక్షాళన చేసే పరమ పావన ద్వారకామాయి ప్రసాదితము అని అణకువగా చెప్పెడివారు. స్వామికి ద్వారకామాయి అనగా అత్యంత శ్రద్ధా భక్తులు. స్వామి శుభ్రపరచిన పిదప ద్వారకామాయి అద్దమువలె నుండెడిది. ద్వారకామాయిలోని దీప స్తంభములు సువర్ణకాంతులీనునట్లు శ్రద్ధ తీసుకునెడి వారు. బాబాచే "మాయి" అని పిలుపించుకుని ధన్యత చెందిన ద్వారకామాయిని ఎంత శుభ్రపరచితే మన పాపములు అంత వేగిరమే ప్రక్షాళన మగునని సెలవిచ్చెడివారు. స్వామీజీ ఎల్లవేళల ద్వారకామాయిని అతి శుభ్రముగా నుంచెడివారు. ఈ కార్యక్రమమును మనస్ఫూర్తిగా నిర్వహించెడివారు. ఇది బాబా తనకు కలగజేసిన అదృష్టమని మురిసిపోయెడివారు.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

జూలై 14వ తేదీ నుంచి సాయిధామం ఆశ్రమంలో యోగ శిక్షణా శిబిరం ప్రారంభమయ్యింది. ఇది 21 రోజులపాటు జరుగుతుంది.

జూన్ 15వ తేదీన పెంజర్ల గ్రామంలోని పూజ్యగురుదేవులచే ప్రతిష్ఠించ బడిన శ్రీ కారుణ్యసాయి ప్రభు మందిరంలో చతుర్థ వార్షికోత్సవానికి రమ్మని శ్రీమతి మరియు శ్రీ విజయకుమారి, డా॥ జి.చంద్రారెడ్డి గార్ల ఆహ్వానం మేరకు శ్రీ సాయిరామ చైతన్యగారు సామూహికంగా శ్రీ సాయినాథ వ్రతాలు జరిపించి, సాయినాథుల వారి తత్త్వాన్ని గూర్చి వారి లీలలు ఎప్పడూ మరువరాదని వివరించారు.

ఆషాఢ మాసంలో వచ్చే గురుపౌర్ణమినే వ్యాసపౌర్ణమి అంటారు. ఈరోజు పరమపవిత్రమైనది. ఆశ్రమంలో గురుపౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో బాబావారిని, గురుదేవులను దర్శించుకుంటారు. సాధుసత్పు రుషులను దర్శించిన మాత్రాననే మన పాపాలు నశిస్తాయి. కోటి తీర్థాలు దర్శించిన పుణ్యం వస్తుంది.

సాయిధామం ఆశ్రమంలో ప్రభాతవేళనే గం.6.00లకు వివిధ గ్రామాల నుంచి శ్రీసాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఆశ్రమ వాసులు, ఆశ్రమం పిల్లలు, భక్తులు రామలింగంపల్లి ఎర్వా హేమంత్‌రెడ్డి (ఎం.పి.టి.సి) మొదలైన భక్తులందరూ బాబా నామాన్ని స్మరిస్తూ 108 కలశాలతో నీటిని తీసుకుని ఆశ్రమం గేటు దగ్గర నుంచి బాబా దేవాలయం వరకు నామస్మరణ చేస్తూ వాయిద్యాలతో బాబా అభిషేకానికి తరలివచ్చారు. శ్రీ సాయిరామ చైతన్యగారి ఆధ్వర్యంలో సాయినాథుల వారికి 108 కలశాలతో జలాభిషేకం, క్షీరాభిషేకం వైభవంగా సాగింది. సాయినాథుల వారి ముఖం అభిషేక సమయంలో చిరునవ్వులు





చిందిస్తున్నట్లుగా ఉంది. అనంతరం సాయినాథుల వారి అలంకరణ అనంతరం అష్టోత్తర శతనామ పూజ బిల్వ, తులసీ పత్రాలతో జరిగింది.

పరమపూజ్య గురుదేవులు సాయిలో ఐక్యమై నాలుగు సంవత్సరాలు నిండింది. చతుర్థ మండలారాధన ఈరోజునే జరుపుకోవడం సంతోషమా, విషాదమా అనేది తెలయని సందిగ్ధస్థితి.

ఉదయం గం.8.00లకు జ్ఞానధామంలో గురుదేవులకు క్షీర, జలాభి షేకం అనంతరం అలంకరణ, ప్రత్యేక పూజ జరిగాయి. గురుదేవులే స్వయంగా ఆశీనులై కరుణ చిందే చూపులతో భక్తులను పలకరిస్తు న్నట్లుగా వారి రూపం దర్శనమిచ్చింది. సాయినాథుల వారి దేవాలయంలో, జ్ఞానధామం మందిరాలలో ప్రధాన పూజలు పూర్తయ్యేటప్పటికి భక్తులతో సాయిదేవాలయం కిటకిటలాడటం ప్రారంభమయింది.

పూజ్య గురుదేవులను సాయి దేవాలయంలోనికి ఆహ్వానించడానికి శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణగారి కుటుంబం (తెనాలి) గురదేవుల పాదుకలను శిరస్సున ఉంచి సాయినామం స్మరిస్తూ మేళతాళాలతో ఉష భవనం నుంచి భక్తులందరూ సాక్షాత్తు గురుదేవులనే ఆహ్వానిస్తున్నాము అని ఎంతో భక్తిశ్రద్ధలతో నామస్మరణతో దేవాలయానికి తరలివెళ్ళారు.

దేవాలయం నిండా భక్తులు. సమయం 10.30 అయ్యింది. బాబా వారికి జరగబోయే సహస్ర నామార్చన కోసం వారి గోత్రనామాలను నమోదు చేయించుకుంటున్నారు. ప్రధాన పూజ దగ్గర శ్రీ ఎర్వా హేమంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, రామలింగంపల్లి సర్పంచ్‌గార్లు కూర్చోగా సాయి నాథుల వారికి లక్ష పుష్పార్చన మొదలయ్యింది. సహస్ర నామాలతో, ఓంకార నాదంతో దేవాలయం మారుమ్రోగింది. బాబా వారి చెంతకు చేరుతున్న వన్నె వన్నెల పువ్వులు ఎంత అదృష్టం చేసుకున్నాయో! వివేకం ఉన్న మనిషి చెయ్యలేని పని ఒక్కరోజు జీవితంలోనే అవి మోక్షాన్ని పొందాయి.

అనంతరం పూజ్య గురుదేవులకు గురు పాదుకాపూజ ఎంతో

సుందరంగా అలంకరించిన సింహాసనంలో గురుదేవులు ఆశీనులు కాగా, వారి పాదుకలకు ట్రస్టు సభ్యులు పూజ చేసుకునే భాగ్యానికి నోచుకున్నారు.

అనంతరం సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు నృత్య గీతాలతో వచ్చిన వారందరినీ అలరించారు. విద్యార్థులకు నిర్వహించిన "మా గురుదేవులు" అనే శీర్షికతో వ్యాసరచన, కవితా పోటీలలో పాల్గొని వారి చిన్ని హృదయాలలో గురుదేవుల స్థానాన్ని ఎలా భద్రపరచుకున్నారో వింటుంటే భక్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఏ వ్యక్తి గురించి అయినా వారితో పరిచయం ఉంటేనే గొప్పగా వ్రాయగలం. అసలు వారు ఎలా ఉండేవారో, వారి నోటి మాటకు కూడా నోచుకోని చి॥ సాయిధామపు యామిని (8వ తరగతి) వారి నోట, వీరి నోట విన్న మాటలు, ప్రతి నిత్యం సాయి రామ చైతన్యగారు గురుదేవుల గురించి వివరించే సందర్భాలను గుర్తుపెట్టుకొని వ్యాసరచనలో ప్రథమ బహుమతిని ట్రస్టు సభ్యులు శ్రీ డా॥ జి.చంద్రారెడ్డిగారి చేతుల మీదుగా అందుకున్నది. శ్రీమతి ఝాన్సీలక్ష్మీగారి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి చి॥ అలేఖ్య (10వ తరగతి) అందుకున్నది. కవితల పోటీలలో ప్రథమ బహుమతి చి॥ హరీష్‌కు (10వ తరగతి) శ్రీ రామమోహనరావుగారి చేతుల మీదుగా అందుకోగా, ద్వితీయ బహుమతి చి॥ దేవీశ్రీ (8వ తరగతి) శ్రీ ఆనందం గారి చేతుల మీదుగా అందుకున్నారు.

ఇరవై సంవత్సరాలుగా ప్రథమశ్రేణిలో వంద శాతం ఫలితాలను సాధిస్తున్న శ్రీ సాయి విద్యాధామం పాఠశాల ఈ సంవత్సరం కూడా మండలంలో తృతీయ స్థానం సంపాదించి సాయిధామం పేరు ప్రతిష్ఠలు ఆకాశానికి ఎగురవేసింది. పాఠశాల మొదటిస్థానంలో నిలిచిన చి॥ వైష్ణవికి రూ.5000/-లు రూపాయలు, శాలువాతో తల్లిదండ్రుల సమక్షంలో ట్రస్టు సభ్యులు సత్కరించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఎమ్.సతీష్‌కి





రూ.2000/-, శాలువాలతో సత్కరించారు. ఈ విజయాలు సాధించడం పిల్లల హార్డ్‌వర్క్, ఉపాధ్యాయుల నిరంతరం కృషికి తోడు పూజ్య గురుదేవుల, మాతాజీల పరిపూర్ణ ఆశీస్సులు అని మా పరిపూర్ణ విశ్వాసం.

అటుపైన శ్రీ సాయిరామ చైతన్యగారు గురుపూర్ణిమ వైశిష్ట్యాన్ని, వ్యాసుల వారి గొప్పతనాన్ని, గురుభక్తిని, గురుసేవ చేయవలసిన రీతిని గురించి వివరించి, సమాజసేవనే గురుసేవగా భావించాలని గురుదేవుల అభిమతం కూడా అదే అని వివరించారు.

అనంతరం బాబా వారికి మహాహారతి జరిగింది. యథాప్రకారం మా నాయర్ మామయ్య అరవిందాక్షన్ నాయర్ గారు (ట్రస్టు సభ్యులు) భోజనాల ఏర్పాట్లు చేసి భక్తులందరికీ ఏ యిబ్బంది లేకుండా సాయి ప్రసాదాన్ని అందించారు.

ఈ కార్యక్రమానికి ఆర్థికంగా, హార్థికంగా సహాయ సహకారాలు అందించిన పూజ్యగురుదేవుల భక్తులకు, శిష్యులకు శ్రీసాయినాథుల వారి పరిపూర్ణ ఆశీస్సులు, పూజ్య గురుదేవుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని సాయివాణి మనసారా కోరుకుంటుంది.

జూలై 19వ తేదీ శుక్రవారంనాడు శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో యోగారోగ్య శిబిరంను రామకృష్ణా మిషన్ వారి సహకారంతో నిర్వహించడం జరిగింది.

## శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి

జూన్ 18, 19, 20 తేదీలలో బాబా వారి పంచమ వార్షికోత్సవం మరియు పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహరాజ్ వారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఎంతో వైభవోపేతంగా జరిగినది.

ఫిబ్రవరి 21వ తేదీన గురుదేవుల మందిరం జ్ఞానధామం-3 శంకుస్థాపన కార్యక్రమం పూర్తయిన తరువాత యుద్ధ ప్రాతిపదికన మందిర

నిర్మాణం, మందిరానికి చుట్టూ, బాబా వారి మందిరం రామాలయం, హనుమ గోపురం చుట్టూ బండ పరిచే కార్యక్రమం, రామాలయం లోపల గర్భగుడిలో, హనుమదాలయం లోపల, జ్ఞానధామం-3 లోపల టైల్స్ వేసే కార్యక్రమం, గోశాల నిర్మాణం, జ్ఞానధామం డిజైన్ వర్కు, హనుమదాలయం గోపురం జూన్‌లో నిర్ణయించిన ఆవిష్కరణ ముహూర్తానికి అన్ని పనులు పూర్తి చేయాలని శ్రీ సాయిరామ చైతన్యగారు సంకల్పించి, నిప్పులు చెరిగే ఎండను సహితం లెక్కచేయకుండా పని వారి దగ్గర ఉండి త్వరితగతిన పనులు పూర్తి చేయించడం ఎంతో వ్యయప్రయాసల కోర్చి యీ బృహత్తర కార్యక్రమం 4 నెలలలో పూర్తికావడం విశేషం. ఆలయాల చుట్టూ బండపరచడానికి 35,000 భక్తితో విరాళమిచ్చిన శ్రీ కిట్టా హనుమంతరావుగారికి సాయి ఆశీస్సులు.

జూన్ 16వ తేదీ సాయంత్రం సాయిధామం నుండి శ్రీ సాయిరామ చైతన్యగారు, ఆశ్రమం పిల్లలు వచ్చారు. తెనాలి నుండి శ్రీ గోపి కరపత్రాలు ముద్రణ బాధ్యత తీసుకుని సకాలంలో అందించడంతో కార్యక్రమం పనులు మొదలైనవి. ఒకప్రక్క గ్రామంలో కరపత్రాలు పంచడం, మైకు ద్వారా సత్తెనపల్లి మొత్తం ప్రచారం చేయించడం జరిగినది. శ్రీసాయిరామ చైతన్య గారి ఆధ్వర్యంలో ముందు వేయించిన యాగశాలలో హోమకుండాలను ఏర్పాటు చేయించారు. ఒకప్రక్క పెద్దాపురం నుండి వచ్చిన పెయింటర్స్ జ్ఞానధామం-3 మందిరానికి పెయింట్లు వేయడం మొదలుపెట్టారు. 17వ తేదీ ఆలయాలన్నిటికి ప్రధాన ద్వారానికి లైటింగ్ వేసి మైకులు పెట్టడంతో ఆశ్రమమంతా విద్యుద్దీపాలతో శోభాయమానంగా సందడి మొదలైనది. హనుమదాలయం ఒక్కటి బోసిగా ఉన్నదని గోపురం కట్టించి డిజైన్ వేయించాలని సంకల్పించడంతో రంగులు మినహా మిగతా పనంతా కూడా త్వరితగతిన పూర్తి చేసారు. హనుమదాలయం ఎంతో సుందరంగా రూపుదిద్దుకున్నది.





17వ తేదీ సాయంత్రానికి యాగ్నిక బ్రహ్మశ్రీ వడ్లమూడి మల్లిఖార్జున దీక్షితుల వారి శిష్యులు శ్రీ కుమార్‌గారు వారి బృందం ప్రతిష్ఠా, హోమ కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చారు. మూడు రోజులు వారు ఉండటానికి బస ఏర్పాట్లు చూసాము. ఆశ్రమ ప్రాంగణం అంతా కూడా కాషాయ జెండాలు కట్టడం, మరుసటి రోజు కార్యక్రమానికి ఏర్పాట్లు చూడటంతో క్షణం తీరిక లేకుండా గడిచిపోయినది.

18 ఉదయం 5.15 ని.లకు బాబా వారికి కాకడ హారతి ఇవ్వటంతో కార్యక్రమాలు మొదలైనవి. బ్రహ్మముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమం తరువాత నూతనంగా నిర్మాణం కావించిన గోశాల ప్రారంభోత్సవం, గోపూజ జరిగినది. అనంతరం హోమ యజమానులకు ధీక్షాధారణ కావించి గణపతి పూజ, పుణ్యాహం, పంచగవ్య ప్రాశనము, మూల మంత్ర అనుష్ఠానములు జరిగినవి. ఉదయం 6 గం.లకు ఆనందసాయి ప్రభు వారికి క్షీరాభిషేకం నూతన వస్త్రాలంకరణ వివిధ పుష్పాలతో అష్టోత్తర శతనామ పూజ జరిగినది. సాయంత్రం 4 గం.ల నుండి అలంకరించిన వాహనంపై సాయినాథుల వారి ఉత్సవమూర్తి ఊరేగింపు పురవీధులలో వైభవంగా జరిగినది. భక్తులు సాయినాథుల వారిని కనులారా దర్శించి, వారులు పోసి కానుకలు హారతులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఊరేగింపు ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని వీధులు తిరిగి 11 గం.లకు ఆశ్రమం చేరుకున్నది. 18 సాయంత్రం 6 గం.లకు వేద పారాయణము, అఖండ స్థాపనము, అంకురారోహణము, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, గణేశ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఆశ్రమ ప్రాంగణం అంతా వేదమంత్రాలతో ప్రతిధ్వనించింది.

19వ తేదీ యధావిధిగా కాకడ హారతి, సాయినాథుల వారికి క్షీరాభిషేకం, పూజా కార్యక్రమం జరిగినది. ఉదయం 8 గం.లకు వేద పారాయణ, నిత్యవిధి, వాస్తు పూజ, హోమములు, పూజ్య గురుదేవుల విగ్రహానికి పంచ

గవ్యాది వాసము, క్షీరాధివాసము, ఆదివాసాంగ హోమములు, రక్షోఘ్న హోమములు, రుద్ర హోమములు, దుర్గాసూక్త, పురుష సూక్త హోమములు, సుదర్శన హోమములు వైభవోపేతంగా జరిగినవి.

సాయంత్రం 6 గం.లకు ప్రధాన కలశ స్థాపన, ధాన్య పుష్పాది వాసము, పంచశయ్యాది వాసములు, కళాహోమములు, శ్రీ సూక్త, లక్ష్మీగణపతి, అఘోర హోమములు రాత్రి 11 గం.ల వరకు జరిగినవి.

20వ తేదీ గురువారం పరమపూజ్య గురుదేవులు పాలరాతి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం, సాయినాథుల వారికి 108 కలశాలతో అభిషేక కార్యక్రమం, ఒకప్రక్క అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి వంట వాళ్ళ ఏర్పాట్లు, 19వ తేదీ రాత్రి తెనాలి నుండి శ్రీ గోపి వారి కుటుంబ సభ్యులు తెచ్చిన పూలదండలతో అలంకరణ, ఏర్పాట్లతో రాత్రి గడిచిపోయినది. వేకువజామున కొద్దిగా వర్షం పడినప్పటికీ కార్యక్రమానికి ఎటువంటి ఆటంకం కలగలేదు.

20వ తేదీ ఉదయం 5 గం.లకు మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా 108 కలశాలతో భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి ప్రధాన ద్వారం దగ్గరకు వచ్చారు. శ్రీ సాయిరామ చైతన్యగారు వచ్చిన భక్తులందరిచేత సాయినామం పలికిస్తూ ప్రధాన, ఉపాలయాల చుట్టూ ప్రదక్షిణగా తిరిగి సాయి మందిరంలోకి అడుగుపెట్టారు. ముందుగా శ్రీ సాయిరామ చైతన్యగారు పంచామృతాభిషేకం చేసిన తరువాత వచ్చిన భక్తులతో అభిషేకం చేయించారు. సాయి మందిరం సాయి నామంతో ప్రతిధ్వనించింది. భక్తులు భక్తి పారవశ్యంతో తాము తెచ్చిన కలశాలలోని జలముతో అభిషేకం చేసి తరించారు. అనంతరం బాబా వారు నూతన వస్త్రాలంకరణతో కిరీటధారులై ప్రసన్నవదనంతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పూజా కార్యక్రమం జరిగినది.

ఉదయం 7 గం.లకు నిత్యవిధి, వేదపారాయణ, రత్నన్యాసము, యంత్ర





స్థాపన, కలశస్థాపన కార్యక్రమం జరిగినది. ఉదయం 9 గం.లకు హైదరాబాద్ నుండి శ్రీ నిర్మలయోగ భారతి మాతాజీగారిని రైల్వేగేటు దగ్గర నుండి శ్రీ సాయిరామ చైతన్యగారు, ఆశ్రమవాసులు, భక్తులు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతంతో ఆశ్రమానికి ఆహ్వానించారు. అనంతరం 11.24 ని.లకు గురుదేవుల విగ్రహావిష్కరణ మాతా నిర్మలయోగ భారతి గారి చేతుల మీదుగా జరిగినది. సాక్షాత్తు శ్రీ గురుదేవులు అక్కడే కూర్చున్న భావన మాకు కలిగినది. అనంతరం కళాన్యాసము, మనోన్మీలనము, ప్రాణ ప్రతిష్ఠ, ధేను, తృణాగ్ని, మహీదన దర్శనము, కూష్మాండ బలి, అష్టోత్తర శత కలశ స్థాపనము, పూర్ణాహుతి, వేద పండితులచే ఆశీర్వచనము, అనంతరం హోమ కార్యక్రమాలు నిర్వహించిన వేదపండితులకు సత్కారం జరిగినది. శ్రీ మాతా నిర్మల యోగ భారతిగారు నిర్వహించిన ధార్మిక సభలో మన సంస్కృతి యొక్క గొప్పతనం, తల్లిదండ్రులు పిల్లల పట్ల చూపించాల్సిన బాధ్యత మొదలైన విషయాలతో చెప్పిన ప్రవచనం భక్తులందరినీ ఆకట్టుకున్నది. అందరూ శ్రద్ధాళువులై ఆలకించారు. అనంతరం శ్రీ సాయిరామ చైతన్యగారు ఆశ్రమం గురించి ఈ బృహత్తర కార్యక్రమం ఇంత త్వరితగతిన పూర్తయిన విశేషాలతో ఈ ఆశ్రమం ఒక ఆధ్యాత్మిక సేవా కేంద్రంగా విలసిల్లాలని, అందుకు భక్తుల సహకారం కూడా అవసరమని నినదించారు. అనంతరం ఆశ్రమం పట్ల సేవానిరతి కలిగిన భక్తులను సత్కరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ జరిగినది. సుమారు 2000 మందికి అన్నప్రసాదం అందించారు.

జూలై 16వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా ఆనందసాయి ప్రభు వారికి మరియు పరమపూజ్య గురుదేవులకు పంచామృత క్షీరాభిషేక, జలాభిషేకాలు వైభవోపేతంగా జరిగినవి. వచ్చిన భక్తులు సాయినాథుల వారికి, గురుదేవులకు స్వయంగా అభిషేకం చేసి తరించారు. కాషాయాంబర

ధారులై, కిరీటధారులై ఆనందసాయి ప్రభువారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పూజా కార్యక్రమం జరిగనది. వచ్చిన భక్తులకు శ్రీ యక్కల సాంబశివరావుగారు ప్రసాదం అందించారు. 9.30 ని.లకు సామూహికంగా సాయినాథ వ్రతం ఆలయ పూజారి ప్రేమకుమార్ గారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగినది. వ్రతం చేసుకున్న భక్తులు తమ కోర్కెలు తీర్చమని సాయినాథుల వారిని వేడుకున్నారు. అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమం ఆనందకరంగా ముగిసినది.

**సాయినాథ క్షేత్రం(మైనేనివారి పాలెం)-గురుపౌర్ణమి**

ప్రతి సంవత్సరంలాగానే క్షేత్రంలో గురుపౌర్ణమ కార్యక్రమాలు జరిగినవి. ముందుగా ఉదయం కాకడహారతితో ప్రారంభం అయి, ఆ తరువాత సాయినాథుల వారికి క్షీరాభిషేకం, జలాభిషేక కార్యక్రమాలు జరిగినవి. భక్తులు స్వయంగా ఆవుపాలు తెచ్చుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో అభిషేకంలో పాల్గొన్నారు.

ఆ తరువాత భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలు, పూలదండలు, తులసిమాలలతో భక్తులకు దర్శనమిచ్చారు బాబావారు. ఆ తరువాత బాబా వారికి అష్టోత్తర శత నామ పూజ జరిగింది.

ఉదయం 10 గం.లకు పూజ్య గురుదేవుల మందిరం జ్ఞానధామంలో స్వామి వారి పాదుకా పూజ నిర్వహించడం జరిగింది. భక్తులందరూ గురుదేవుల మందిర ప్రాంగణంలో కూర్చుని పాదుకా పూజలో పాల్గొన్నారు. స్వామివారి అష్టోత్తర శతనామాలతో పాదుకలకు పూజ చేయడం జరిగింది. భక్తులందరూ సామూహికంగా అష్టోత్తర శత నామాలు చదివారు. తరువాత స్వామీజీ దగ్గర మంత్రపుష్పం, ఆత్మప్రదక్షిణ ముగించుకుని మధ్యాహ్న హారతికి ఆలయానికి వచ్చారు.

హారతి అనంతరం సుమారు 150 మందికి అన్నప్రసాద వినియయం జరిగింది.





స్వామి వారికి నూతన వస్త్రాల దాత - శ్రీ యరగళ్ల మారయ్య, శ్రీమతి విజయలక్ష్మి దంపతులు.

స్వామి వారి అన్నప్రసాద దాత - శ్రీ వాడపల్లి మురళీకృష్ణ, శ్రీమతి రాధ దంపతులు.

ఈ కార్యక్రమానికి శ్రమ రూపేణ, ధనరూపేణ సాయపడిన భక్తులందరికీ బాబా వారి కృపాకటాక్షాలు మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.



# మాతృమూర్తులకు మనవి

**- శ్రీ మాధవరావు గోళ్వల్కర్ గురూజీ**

**(పాంచజన్యం నుండి)**

మన సమాజంలో మొగ్గ తొడుగుతున్న క్రొత్త తరాలను సాకవలసిన ప్రత్యేకమైన బాధ్యత మన మాతృమూర్తులపై ఉన్నది. అయితే, సాకటమంటే సరైన అర్థం ఏమిటో ఇపుడు ఆలోచిద్దాం.

భోజనం పెట్టి, బట్టలు కట్టి పిల్లలను పాఠశాలలకు పంపించడం ఒక్కటేనా చేయాల్సిన పని? అలాకాక విధి నిర్వహణ పట్ల భక్తీ, స్వయం కృషీ, మాతృభూమి పట్ల ప్రేమ, సమాజసేవకు సంసిద్ధత వంటి సవ్యమైన సంస్కారాలను వారిలో అలవరచడం ముఖ్య విషయం కాదా?

శీల నిర్మాణంలోని ఈ అంశం పట్ల శ్రద్ధ వహించడం మాతృమూర్తుల ప్రథమ కర్తవ్యం. ఇందు నిమిత్తమై వారు పసివారి మనసులను తీర్చిదిద్దగల అనేకములైన చిన్న చిన్న విషయాల పట్ల శ్రద్ధ వహించాలి.

నా చిన్నతనపు రోజుల్ని గుర్తు చేసుకోగానే నేను మధురస్మృతుల్లో

మునిగిపోతుంటాను. వేకువనే నేను నిద్ర నుండి మేల్కొనేసరికి మా మాతృమూర్తి తన ప్రాతఃకాల కృత్యాలలో నిమగ్నమై వుంటూనే, ఏవేవో స్తోత్రాలు, భగవన్నామ సంకీర్తనములు చేసేవారు. ఆ స్వరమాధురిని నేను వింటూ ఉండేవాణ్ణి.

ప్రశాంతమూ, గంభీరమూనైన వేకువ వేళల్లో వినవస్తుండే ఆ మధుర స్వరాలు నా పసిమనసు మీద ఎంతటి ప్రగాఢమూ, పవిత్రమూనైన ప్రభావ ముద్రలను ముద్రించాయో గదా! దీనికి, నేటి అధునాతనము లనబడే ఇండ్లకూ తారతమ్యం చూడండి.

వేకువ జామున నేటి తల్లులు వారి పిల్లలను లేపనూ లేపరు. దైవ సంకీర్తన కూడా చేయరు. తరచు పిల్లలు అసభ్యకరమైన సినిమా పాటలు వింటూనో, ఆ బాణీల్లో కూనిరాగాలు తీస్తూనో తమ దినకృత్యాన్ని ప్రారంభిస్తుంటారు.

ఒక యువతి-చదువుకోనిది కాదు-వంటింట్లో పని చేసుకుంటూ, తన బిడ్డను నిద్ర పుచ్చుతూ, అతి చవకబారు పాటలను పాడుతూ వుంటుం దనే ఉదంతం నాకొకటి తెలుసు. తమ తల్లిదండ్రుల్లో యిట్టి ప్రవర్తన చూచిన పిల్లలు పెద్దల్ని అలాగే అనుకరిస్తారనుకోవడానికి ఆశ్చర్యం లేదు. ఆ విధంగా మన సంస్కృతి సభ్యతలకు నోచుకోని కుటుంబాలలోని బిడ్డలు తేలికగా క్రైస్తవ ప్రచారానికి ఎర అయిపోతారు.

ఎనిమిది తొమ్మిది సంవత్సరాల వయస్సు కలిగిన ఒక బాలిక సెలవుల్లో తన ఇంటికి వచ్చినపుడు ఒక ఉదంతం జరిగింది. కృష్ణ జన్మాష్టమి రోజున వ్రతం చేసుకోవాలని తల్లి అనగానే ఆ పిల్ల "అటువంటి వ్యభిచారి పుట్టిన రోజున మనకు పండుగెలా అవుతుంది? క్రీస్తు పుట్టినరోజున పండుగ చేసుకోవాలి గానీ" అని తల్లిదండ్రుల్ని ప్రశ్నించింది.

ఎనిమిది తొమ్మిదేళ్ల బాలిక తన తల్లిదండ్రులను అలాంటి అసభ్యకర





మైన ప్రశ్నలు వేయడం మీరు ఊహించగలరా?

మన మాతృమూర్తులు వేకువజామునే పిల్లలను నిద్రలేపి, కుటుంబం లోని పెద్దలకు వారు నమస్కరించి, తమ ఇలవేల్పును భక్తితో పూజించేట్లుగా చేయాలి. మాతృభక్తినీ, దేశభక్తినీ, దైవభక్తినీ ప్రతి హిందూ బాల బాలికలల్లోనూ కలిగించవలసిన పవిత్ర బాధ్యత మన మాతృమూర్తుల మీద ఉంది.

**వస్త్రధారణ సంస్కారప్రదంగా ఉండాలి :**

ఇంక వస్త్రధారణను చూద్దాం. దుస్తులు, ఇతర అలంకరణ వస్తువులు కూడ పసి మనసుల మీద చెరగని ముద్రలను వేస్తాయనే సంగతి తప్పక మనం గుర్తించాలి. వీటి ద్వారా కూడ పిల్లలు మన సంస్కృతీ విశేషాలను అలవరచుకొనేట్లుగా మాతృమూర్తులు శ్రద్ధ వహించాలి.

మళ్లీ ఒకసారి నా బాల్యపు తొలిదశ నాకు గుర్తొస్తోంది.

నాకు ఒత్తుగా పొడవైన ఉంగరాల జుత్తు ఉండేది. మా తల్లిగారు అప్పుడప్పుడు నా తల దువ్వి బాలకృష్ణుడిలా అగుపించే రీతిగా కొప్పులో నెమలిఫించం అమర్చేది. ఆమె ఒక పూలదండ నా మెడలో వేసి "మన మధు చూడు! సరిగా బాలకృష్ణుడిలా ఎలా అగుపిస్తున్నాడో!" అని ఇతరులతో అంటూ ఉండేది.

అలాంటి సంగతులు చూడటానికి చిన్నవే అయినా మన సాంస్కృతిక ప్రమాణాలకు తగ్గట్టుగా పసివాళ్ల మనస్తత్వాన్ని మలచడంలో దోహదం చేస్తాయి. అట్లా కాకుండా పిల్లలను ఐరోపా దేశాల పద్ధతిలో పెంచితే, వారి మీద పడిన ప్రభావాలు కూడ అవే రంగులు పులుముకుంటాయి.

అటువంటి మనోభూమిక మీద, మాతృభూమి పట్ల ప్రగాఢమైన భక్తి భావాలు వాని యొక్క ఆదర్శ ప్రమాణాలు మొలకెత్తవు.

**(మిగతా వచ్చే సంచికలో)**

# నవ్వించటమే కర్మయోగం

'లూకేప్టెలో' ఒక హాస్యనటుడి పేరు. ఆయన రంగస్థలం మీద కనబడితే జనం విరగబడి నవ్వేవారు. ఒకసారి ఆయన ఇంటికి దూరంగా నాటకానికి సిద్ధమవుతున్నాడు. ఫోను మోగుతుంది టైము అయింది రమ్మని చెప్పడానికి. మరోవైపు కబురు వచ్చింది - తన ఏకైక పుత్రుడు నీళ్ళ టాంకులో పడి మరణించాడని. లూకెప్టెలో గబగబా బయటకు వచ్చాడు కాని కాళ్ళు ఆగిపోయినాయి. "నా సర్వస్వం నశించింది, నా దగ్గర మిగిలిందేమీ లేదు. నా లోకమే కూలిపోయింది. నేనింక లోకులను నవ్వించేదేముంది?" అనుకున్నాడు. ప్రక్క ఇంటిలో నుండి ఇద్దరు పిల్లలు అతన్ని చూచి పరుగెత్తుకు వచ్చారు. చెరో చేతిని పట్టుకుని "అంకుల్, అంకుల్, నువ్వెప్పుడూ అందర్నీ నవ్విస్తావు కదూ! మమ్మల్ని నవ్వించవూ!" అన్నారు. ఆయన వాళ్లవైపు చూసాడు. తన బిడ్డ వయసు పిల్లలే. దాదాపు అలాగే ఉన్నారు. అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీళ్ళు ప్రవహించసాగాయి. నా బిడ్డ కూడా ఇలాగే నవ్వుతుండేవాడు. ఇలాగే ఆడుతూండేవాడు.

అతని వణికే పెదవుల్ని ముఖాన్ని చూచి ఆ పిల్లలు తెల్లబోయారు. వాళ్లకి యీ అంకుల్ ఎప్పుడూ అందర్నీ నవ్వించగలడనే తెలుసు- కన్నీళ్లు కార్చగలడని తెలియదు. ఇద్దరిలో చిన్నవాడు మమ్మల్ని కాస్త నవ్వించ డంకుల్! అన్నాడు మళ్లీ. అతని ముద్దు ముఖం చూస్తుంటే లూకెప్టెకు తన బిడ్డ స్వయంగా వచ్చి ఎదురుగా నిలబడి 'ప్రపంచమంతటిని నవ్విస్తావు కదా! నన్ను నవ్వించు నాన్నా!" అంటున్నట్లుగా తోచింది.

లూకేప్టెలో తన ఆత్మకథలో వ్రాస్తాడు. "భగవంతుడు నాకు ఇతరులను నవ్వించే శక్తినిచ్చాడు. నా ముఖంపైన ప్రసన్నత లేకపోవడం, కన్నీళ్లు రావడం నా దురదృష్టం. కాని హృదయంలో ప్రసన్నతా భాండాగారం నిండి ఉంది దాని సహాయంతో ఇతరులను నవ్వించగలను. ఆనందం కలిగించగలను. నేనందించిన ఉల్లాసానికి ప్రతిగా నాకూ ఒక గొప్ప వరం దొరికింది. ప్రపంచమంతటా నిండి ఉన్న పిల్లలందరూ నా వాళ్ళుగానే తోచసాగారు. నా కొడుకే ఇన్ని రూపాలలో వచ్చి నా నవ్వులు పంచుకుంటున్నాడు అన్న ఆనందం నాకు కలగసాగింది. ఈ నవ్వించడం అనేది ఆనాటి నుండి నటన కాదు. పూజగా మారిపోయింది. ఆరాధనగా మారిపోయింది.

తాను చేసిన పనిని మనసారా పరమాత్మ సేవగా తలచి చేసినవాడే మహాజ్ఞానిగా రూపొందగలడు. తొలుత అంతర్యములో ప్రసన్నత, సంతుష్టి నిండి ఉండాలి. అట్టివాడే ఇతరులకు శాంతిని, ప్రసన్నతను పంచగలడు. తాను ఆనందంలో మునగగలడు. ఇతరులకు ఆనందం పంచగలడు. వెంటనే కేప్టెలో ఆ పిల్లలతోసహా రంగస్థలం దగ్గరకు వెళ్లాడు. నాటకంలో పాల్గొన్నాడు. ప్రేక్షకులందరినీ మనసారా హాయిగా నవ్వించాడు.

# ఏ కులజుడైన నేమి? ఎవ్వరైన నేమి?

వేకువ మసకచీకటిలో రామానంద గురుదేవులు గంగానదీ పవిత్ర జలాల నడుమ నిలచియున్నను, గంగా ప్రవాహం తనను మృదువుగా తాకి శుభ్రం చేయటం కోసం వేచి ఉన్నారు. ప్రతిరోజు ఆయనకు ఆ అనుభూతి కలుగుతుంటుంది. ఆరోజు ఎందుకు కలుగలేదో ఆయనకు అర్థం కాలేదు. సూర్యోదయం అయింది. రామానందులు తన కన్నీ ఆశీర్వాదయోగ్యమైన, పావనమైన భావనలే రావాలని, తన జీవన సత్యంతోనే ప్రార్థించారు. కానీ ఆయన మనస్సు అంధకారంలోనే, వ్యాకులంగానే మిగిలిపోయింది.

సూర్యుడు అడవిలోని సాలవృక్షాల మీదుగా, బెస్తవారు విప్పిన పడవల తెరచాపల మీదుగా, గొల్లభామల పాల పాత్రల మీదుగా కాంతులు

ప్రసరిస్తూ బారెడు పైకి వచ్చాడు. రామానందులు నీటిలో నుండి బైటకు వచ్చిన నదీ తీరం వెంట గూళ్ల కోసం హడావుడిగా కన్నాలు త్రవ్వుకుంటూ, రొద చేస్తున్న శ్యూలికల మధ్య నుండి, పొదలు, అల్లుకున్న ఇసుక తిన్నెల మీదుగా నడుచుకుంటూ వెళ్ళారు. చివరికాయన ఒక దుర్వాసనతో నిండిన పల్లెవైపు నడిచారు. అక్కడ బక్క కుక్కలు కొన్ని వీధుల ప్రక్క ఎముకలు నములుతున్నాయి. అక్కడక్కడా పడేసియున్న మాంసపు ముక్కలపైకి గ్రద్దలు వాలుతూ ఉన్నాయి. తోళ్ళు నునుపుచేసే వారు ఉండే పల్లె అది.

భజనుడు తన గుడిసె ముందు పురాతనమైన చింతచెట్టు క్రింద కూర్చొని ఒక ఒంటె జీనుని తయారుచేస్తున్నాడు. స్వచ్ఛంగా నదీ స్నానం చేసి తమ కంపు పల్లెలోకి అడుగు పెట్టిన గురుదేవుని చూడగానే అతని శరీరం కుంచించుకుపోయింది. ఆ వృద్ధ చర్మకారుడు ఆ మట్టిలోనే ఒక అడుగు ముందుకేసి భజనుడిని లేపి గుండెకు హత్తుకున్నారు. కన్నీళ్లతో "స్వామీ! ఇటువంటి మురికి మీకంతా పులుముకుంటున్నారా" అన్నాడు భజనుడు.


రామానందులు ఇలా అన్నారు. "నేను స్నానానికి వెళ్ళేటప్పుడు మీ పల్లెను తప్పించుకొని వెళ్ళాను. అందుకే తన మాతృ ప్రేమ అందరికీ పంచే గంగా మాత ఆశీస్సులు నాకివ్వాళ లభించనే లేదు. ఇదుగో ఇపుడు నీ తనూ స్పర్శతో పునీతమైనాను. గనుక ఆ తల్లి స్పర్శ నా ఆత్మలో అనుభూతి చెందు చున్నాను. ఈ ఉదయం నేను ప్రభాకరుడ్ని వేడుకొన్నాను. నీలో ఉన్న పురు షోత్తముడే (పరమాత్ముడే) నాలోనూ ఉన్నాడు. కాని నిన్ను నేను ఎందుకు ఆవాహన చేసుకోలేకపోతున్నాను అని. ఇదుగో ఇప్పుడు నీ నుదుటి మీద, నా నొసటి మీద ఒకే సూర్యకిరణం ప్రసరించిన ఈ క్షణాన ఆయన సత్య దర్శనం నాకు కలుగుతోంది. ఇక ఈ వేళ నేను గుడికి వెళ్ళవలసిన అవసరమేమీ లేదు".

రామానందుల మాటలు వింటూ భజనుడు కరిగి కన్నీరైపోయాడు.


**(రవీంద్రనాథ్ ఠాగూర్ కవితకు స్వేచ్ఛానుసరణ)**







# మానసిక పూజ



ఒక గురువుగారి దగ్గర పరమ బద్ధకస్తుడైన ఒక శిష్యుడు ఉండేవాడు. వాడికి బ్రహ్మచర్య విధులుగాని, గురువును అనుసరించవలసిన విధానం గాని, గురువాక్కును ఎంత విలువతో స్వీకరించాలన్న విషయంగాని తెలియదు. ఏదో కాలక్షేపం కోసం పెద్దల భయానికి ఆశ్రమవాసం చేస్తు న్నాడే తప్ప వాడికి ఆశ్రమ వాస లక్షణాలేమీ ఒంటపట్టలేదు. తిండిపోతు-కబుర్లపోగు. పైగా అతి తెలివి వెలగబెడుతుంటాడు.

ఒకరోజు ప్రొద్దున్నే ఏదో నములుతూ కన్పించాడు గురువుగారికి. "ఏమిరా నాయనా! ఏదో మంత్రం పలుకుతున్నట్లున్నావు?" అని అడిగారాయన.

"అబ్బే! ఏమీ లేదండి? గురువమ్మగారు కూరగాయలు కోస్తూ, మెత్తబడి పోయిందని దోసపండిస్తే తింటున్నాను" అన్నాడు శిష్యుడు.

"నీకు జ్ఞానం ఎప్పడొస్తుందిరా యింకా? ఊరు తెల్లవారగానే తిండి తప్ప వేరే పనేమీ లేదటరా?" కోప్పడ్డారు గురువుగారు.

"మరి గురువుగారూ, నగరాలలో పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారందరూ తెల్లవారుతూనే ముందుగా కాఫీయో, టీయో పుచ్చుకోనిదే పక్కదిగనే దిగరట. వాళ్ళు బెడ్ టీ, బెడ్ కాఫీ పుచ్చుకొంటుంటే నేనేమైనా బెడ్ దోసకాయ తిన్నానా-శుభ్రంగా ముఖం కడుక్కొని, స్నానం గీనం చేసి మరీ తింటుంటిని. ఇది తప్పంటారా?" ఎలా అన్నాను? అన్న రీతిలో చూస్తున్నాడు శిష్యుడు.

"ఓరి మూర్ఖుడా! అలాటి భ్రష్టులతో నటరా పోల్చుకోవటం? కోడిని చూడు-నిద్ర లేస్తూనే తుక్కుపోగు కెలుకుతుంటుంది. ఆవులు, గేదెలు, కుక్కలు, నక్కలు - ఏ జంతువునైనా చూడు-మేలుకొని ఉన్నంతసేపూ తిండి కోసమే వెదుక్కుంటాయి; వెంపర్లాడతాయి. వాటికి వేరే పనేమీ

ఉండదు. మనం మనుష్యులంరా-జంతువుల్లాగే ప్రవర్తిస్తే మనమూ జంతువులమై పోమటరా!"

శిష్యుడు చాలా వినయంగా నమస్కరించాడు. తల తాటికాయలా గుండ్రంగా తిప్పాడు. "అవును స్వామీ! తమరు సెలవిచ్చింది నిజమే" అన్నాడు.

"అంచేత రేపటి నుండీ ఉదయ కార్యక్రమాలు పూర్తికాగానే కాస్సేపు ధ్యానం, కొంత జపం చేసి, పూజాదికాలు అయ్యాకగానీ తిననన్న నియమం పెట్టుకో, లేకపోతే ఎందుకూ పనికిరావు".

"చిత్తం-అలాగే స్వామీ!"

మరునాడు భోజనాల వేళ వరకూ వరండాలో కూర్చొని వచ్చేపోయే వాళ్లతో గప్పాలు కొడుతూ, వారిచ్చే కొబ్బరిముక్కలో, అరటిపళ్లో, వడపప్పో ఆరగిస్తూ కూర్చున్నారు. మధ్యమధ్య ఏ లఘుశంకకో తప్ప లేచినట్లే లేదు. లోపలి గదుల్లో ఉన్న గురువుగారు ఇదంతా గమనిస్తూనే ఉన్నారు. భోజనాల వేళయింది-గంట మ్రోగింది. అందరితోపాటు మనవాడు కూడా పంక్తిలో కూర్చోబోతున్నాడు. గురువుగారు అతన్ని పిలిచారు.

"ఏమిరా బాబూ, ఇవ్వేళ జపం చేసావా?"

"చేసాను స్వామీ!"

"ధ్యానమో? పూజ చేసావా మరి?"

"ఓ! అన్నీ చేసాను స్వామీ!"

"ఓరి అసత్యవాదీ! ప్రొద్దుటి నుంచీ నువ్వు అక్కడ వరండాలో స్తంభాన్ని ఆనుకొనే కూర్చుంటివి గదా! ఇవన్నీ ఎప్పుడు చేసావురా? నేను చూడలేదను కొని నాతోనే అబద్ధం చెప్తావురా గురుద్రోహీ!"

"రామ రామ - అసత్యం కాదు గురుదేవా! మొన్న శనివారం నాటి సత్సంగంలో తమరే సెలవిచ్చారు గదా-కాయిక పూజ కన్నా మానసిక పూజ మహోత్తమమని! మనసే కాదు శరీరం కూడా ఏమాత్రమూ కదిలించ





కుండా స్థిరంగా ఉంచి మనసంతా నిలిపి జపధ్యానాదులన్నీ చేసాను స్వామీ!"

గురువు గారికి వీటి కొంటెరసం, అతితెలివి అర్థమైనాయి. వెంటనే వంటశాల అధికారిని పిలిచారు. "చూడవయ్యా రామబ్రహ్మం! ఇవ్వేళ వీడికి భోజనం పెట్టకు" అన్నారు. తలూపాడు రామబ్రహ్మం.

శిష్యుడికి దుఃఖం ముంచుకొచ్చింది.

"ఎందుకు స్వామీ!"


"ఎందుకేమిటిరా నాయనా! ఏకాగ్రశక్తితో నీవు మానసిక పూజ చేస్తే నీకు పుణ్యం వచ్చింది గదా! అలాగే మానసికంగా భోజనం చేస్తే నీ శరీరానికి పుష్టి కూడా వస్తుంది. ఇంక మామూలు మనుష్యుల్లాగా యివన్నీ తినడం ఎందుకూ?"

శిష్యుడికి యింక తన ఆట కట్టిందని తెలిసిపోయింది. గురువుగారి ముందు సాష్టాంగపడి లేచి, చెంపలు వేసుకొని, "మన్నించండి స్వామీ! రేపటి నుంచీ తమ ఆజ్ఞ ప్రకారమే శ్రద్ధగా పూజాదికాలు చేస్తాను, క్షమించండి" అన్నాడు.

గురువుగారు అతని తల మీద చేయిపెట్టి ఆశీర్వదించి యిలా అన్నారు.

"నువ్వు జంతువువూ, పశువ్వీ, పక్షివీ కాదురా బాబూ! ఎనభై నాలుగు లక్షల జన్మల తరువాత దొరికిన అద్భుతజన్మతో మనిషివయ్యావు. నీకీ జన్మ- వివేకపూర్ణమైన మానవజన్మ వచ్చినందుకు ఫలితం ఏమిటి? నిరంతర దైవసంకీర్తనంతో భగవంతుని చేరటం. నిరంతర స్మరణ లేకపోతే పోయే - కనీసం వేకువఝామున నిద్ర లేవగానేనైనా కాస్సేపు దైవధ్యానం లేకుంటే ఎలాగరా? వివేకం ఉండి కూడా జీవితం ధన్యం చేసుకోకపోతే పశువుల కన్నా హీనమైపోమా? ఆశ్రమానికి వచ్చి యిక ఫలమేముంది చెప్పు!"

శిష్యుడు సిగ్గుతో, బాధతో "తప్పే!" అన్నాడు మెల్లగా.



# సాష్టాంగ నమస్కారం

- 'రమణాశ్రమ లేఖలు' నుండి

ఈ మధ్యాహ్నం మూడింటికి నాలుగయిదేండ్ల పిల్లవాడొకడు తల్లితో వచ్చాడు. తల్లి భగవానుకు నమస్కరించి కూర్చున్నది. ఆ పిల్లవాడు పదే పదే మ్రొక్కడం సాగించాడు.

భగవాన్ నవ్వుతూ అనుచరులతో "అదిగో చూడు- పదే పదే మ్రొక్కడం సాగించాడు. నమస్కారం చేస్తే మన ఇష్టం వచ్చినట్లాడవచ్చునని అభిప్రాయం. ముందు మ్రొక్కితే వెనక చేష్టలారంభించవచ్చు. చిన్నవాడు వాడికేం తెలుసు. అంతా చేస్తుంటే తానూ ఆరంభించాడు. మ్రొక్కినందుకు వెంటనే ఫలం దొరకాలోయ్. వాడిక్కావలసింది అరటిపండు. ఇస్తే మానేస్తాడు. ఉంటే ఇవ్వు" అని ఇప్పిస్తే వెంటనే ఆ బిడ్డడు కూర్చున్నాడు.

కొంచెం ఆగిన వెనుక ఒకరు వచ్చి, భగవానుకు సాష్టాంగపడి ఏ వేళకూ లేవలేదు. సమీపస్థులు లేపి కూర్చోమన్నారు. అతడెట్లాగో లేచి మళ్ళీ మళ్ళీ నమస్కరిస్తూ, వారింపబడుతూ చివరకు కూర్చున్నాడు.

భగవాన్ తన ప్రక్కనున్న వారితో "నమస్కారమంటే పదేపదే మ్రొక్కడమేనని వారి అభిప్రాయం. ఏం జేస్తాం-అసలు నమస్కారమంటే మనస్సణగటమే"నన్నారు.

"సాష్టాంగ నమస్కారమంటే అర్థం ఏమిటి భగవాన్?" అన్నాడా భక్తుడు.

"స-అష్ట అంగ నమస్కారం. అంటే చేతులు రెండు, కాళ్ళు రెండు, భుజాలు రెండు, వక్షస్థలం, లలాటం - ఈ ఎనిమిది అంగాలు భూమి మీద ఆనించి నమస్కరించడం.

ఆ సాష్టాంగ నమస్కృతి యొక్క భావం ఏమిటంటే-ఈ మన్ను మన్నుతో చేరుతుంది; నేను నేనుగా ఉంటాను అని.





ఆ తాత్పర్యం విచారించి తెలుసుకోవాలి. అది తెలుసుకోకుండా ఏం జేసినా లాభం లేదు. ఉట్టుట్టి నమస్కారంతోనే అంతా వశం కావాలంటారు. కోరిందల్లా స్వామి ఇచ్చివేయాలి. మూటా, ముల్లా కట్టి ఇచ్చేందుకు?

ఎవరైనా నమస్కారం చేశారంటేనే నాకు భయం. వాళ్ళకు మనం అణగి వుండాలి. వాళ్ళు చెప్పినట్లు మనం వినాలి. వారి కోరికలన్నీ తీర్చాలి. వారి మనస్సు తెలుసుకొని వర్తించాలి. ఒకటా; నమస్కారం చేస్తే చాలు మన మీద అధికారం వచ్చేస్తుంది.

మనపాటే ఇట్లాగుంటే ఈశ్వరుని పాటో, పాపం వారు ఎందరికి అణిగి వుండాలో, ఎందరి మాట వినాలో, ఎందరికి వరమీయాలో చూడండి. స్వామిత్వానికే ఇంతుంటే వారి మాట చెప్పాలా.

ఎవరైనా నమస్కారం చేయకుండా ఉంటే నాకు పరమసంతోషం. ఎందుకంటే మనం వాళ్ళకు కట్టుపడనక్కరలేదు గదా అని.

జ్ఞాని తానెప్పుడూ నమస్కారం, ఆశీర్వాదం చేయనక్కరలేదు. ఎందుకంటే-వారి మనస్సెప్పుడూ అణగే ఉండడం వల్ల సదా అందరికీ నమస్కారం చేస్తూనే ఉన్నారన్న మాట.

మనం నమస్కరిస్తే వారు ఎదురు నమస్కరించలేదే, పోనీ! ఆశీర్వాదమైనా చేయలేదే - ఇదేమి స్వామిరా?' అని కొందరనుకుంటారే గాని ఎదుటివారు ఇంకా వంగకముందే వీరు (జ్ఞాని) నమస్కరిస్తూ అణగిపోతారు.

ఆశీర్వాదమన్నా అంతే.

"సదా మనస్సణగి ఉండడమే ఆశీర్వాదం. జ్ఞాని మనస్సెప్పుడూ అణగే ఉంటుంది. ఇక చేసేదెవరు? చేయబడేదేమి?" అని సెలవిచ్చారు భగవాన్.